# 'ఇండియన్ ఎడిసన్' జి.డి. నాయుడు



**టాటాలు లక్ష రూపాయల కారును ప్రవేశపెట్టగానే ప్రపంచమంతా అదో అద్భుతంలా భావించింది. కానీ, 1952లోనే రెండు వేల రూపాయలకే కారును అందిస్తానన్న ఒక గొప్ప ఆవిష్కర్త మాత్రం కనీస గుర్తింపునకు కూడా నోచుకోలేదు.'ఇండియన్ ఎడిసన్' గా ఆయన సన్నిహితులు పిలుచుకునే జి.డి.నాయుడు.. మన దేశంలో తొలి ఎలక్ట్రిక్ మోటార్‌ను, తొలి మోటారు కారును తయారు చేశారు.**

1893 మార్చి 23న కోయంబత్తూరు సమీపంలోని కాలంగల్‌లో నాయుడు జన్మించారు. ఆయన పూర్వీకులు వ్యాపార రీత్యా ఆంధ్ర ప్రాంతం నుంచి కోయంబత్తూరుకు వెళ్లి స్థిరపడ్డారు. నాయుడు బస్సు డ్రైవరుగా జీవితాన్ని ప్రారంభించారు. కొద్దికాలంలోనే రవాణా వ్యాపారం బాగా అభివృద్ధి చెందడంతో మరికొన్ని బస్సులు సమకూర్చుకొని, యునైటెడ్ మోటారు సర్వీసు (ums) సంస్థను స్థాపించారు. యూఎమ్ఎస్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు రంగంలో దేశంలోనే అగ్రగామి సంస్థగా పేరుగాంచింది. దేశంలో మొట్టమొదటి మోటారు కారు (1937లో) తయారైంది జి.డి.నాయుడి యూఎంఎస్ ఫ్యాక్టరీ నుంచే!

## ఎన్ని ఆవిష్కరణలో..

నాయుడు చేసిన ఆవిష్కరణల్లో 'రసాలత' అనే ఎలక్ట్రిక్ రేజర్... నాడు అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న రేజర్లన్నిటికన్నా తక్కువ ధరకు లభించడమే కాకుండా, వినియోగదారులకు ఎక్కువ సర్వీస్‌నిచ్చేది. రేజర్‌తో పాటు ఆయన తయారు చేసిన పదునైన, నాజూకైన బ్లేడ్లు, ఫోటోగ్రాఫిక్ కెమెరాల్లో దూరాన్ని సర్దుబాటు చేసుకొనే అడ్జెస్టర్, పండ్ల రసాన్ని తీసే పరికరం, ఓట్లు లెక్కించే యంత్రం, కిరోసిన్‌తో నడిచే ఫ్యాను ఆయన ప్రతిభకు తార్కాణాలు. 1941లో రేడియోను 70 రూపాయలకే తయారు చేస్తానని నాయుడు ప్రకటించారు. 1952లో పెట్రోల్‌తో నడిచే రెండు సీట్ల సామర్థ్యం గల కారును రూ.2 వేలకే తయారు చేశారు. కానీ ప్రభుత్వం లైసెన్స్‌ను మంజూరు చేయకపోవడంతో ఆ ఆవిష్కరణలు ప్రజలను చేరకుండా ప్రారంభదశలోనే ఆగిపోయాయి.

## వ్యవసాయరంగంలో సైతం..

నాయుడు ఆవిష్కరణలు పారిశ్రామిక రంగానికే పరిమితం కాలేదు. ఆయన 10 అడుగుల ఎత్తు పెరిగే హైబ్రిడ్ పత్తి మొక్కలనే కాకుండా.. అధిక దిగుబడినిచ్చే తృణ ధాన్యాల పంటలను కూడా పండించారు. వ్యవసాయ రంగంలో నాయుడు చేసిన ఆవిష్కరణలను సర్ సి.వి.రామన్ 'వృక్షశాస్త్ర అద్భుతాలు' అని అభివర్ణించారు.

SAKSHI

### చదివింది మూడో తరగతే

భారత్‌లో తొలి ఎలక్ట్రిక్ మోటార్‌ను తయారు చేసింది నాయుడే. ఎలక్ట్రికల్, మెకానికల్, ఆటోమొబైల్ రంగాల్లో ఆయన చేసిన ప్రయోగాలు, ఆవిష్కరణలు ఎనలేనివి. ఇన్ని ఆవిష్కరణలు చేసిన నాయుడు చదివింది మాత్రం మూడో తరగతే! భారత్‌లో తొలి ఎలక్ట్రిక్ మోటార్‌ను తయారు చేసింది నాయుడే. ఆయన ఆవిష్కరణలు చాలా వరకు పారిశ్రామిక రంగానికి సంబంధించినవి.

### ప్రజాసేవలో..

ఆటోమొబైల్ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న నాయుడు... 1944లో పదవీ విరమణ చేసి ప్రజాహిత కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. సమాజంలో అణగారిన వర్గాలకు చేయూతగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. ఆయన కృషి, దాతృత్వాల ఫలితంగా కోయంబత్తూరులో నిర్మించిన విద్యా సంస్థలు జి.డి. హయ్యర్ సెకండరీ స్కూలు, ఆర్థర్ హోప్ పాలిటెక్నిక్, ఆర్థర్ హోప్ ఇంజినీరింగ్ కాలేజీలే తార్కాణం. 1967లో ఆయన పేరిట జి.డి. నాయుడు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌ను కోయంబత్తూరులో ప్రారంభించారు. 1971లో తమిళనాడు ప్రభుత్వం ఆయన పేరిట జి.డి. వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసింది. 1974 జనవరి 4న నాయుడు మరణించారు.

ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత సర్ సి.వి.రామన్ నివాళులర్పిస్తూ.. 'జి.డి.నాయుడు గొప్ప విద్యావేత్త, పారిశ్రామిక క్షేత్రాల వ్యవస్థాపకుడు. నిస్వార్థంతో సహాయం చేసే దయార్ద్ర హృదయుడు... కోట్లలో ఒకడిగా కీర్తించదగిన వ్యక్తి' అని కొనియాడారు.

–లక్ష్మీ.. ఈమని